ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలకు రక్షణ కల్పించాలి - ప్రొఫెసర్ హరగోపాల్

ఖైరతాబాద్, జూన్ 11: ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలకు రక్షణ కల్పించాలని ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రజలందరికీ రాజ్యాంగం ఒకటే హక్కు కల్పించిందని, ఆదివాసీలకు కల్పించిన రక్షణ చట్టాలను ఉల్లంఘించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై యుద్ధం చేస్తున్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆ రాష్ట్ర, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న దమనకాండను బయటి ప్రపంచానికి తెలిపినందుకు సోడీ భీమా, జోశా, జోగా మడకంలను పోలీసులు అక్రమంగా ఎత్తుకెళ్లారన్నారు. అడవుల్లో గనుల తవ్వకాన్ని వ్యతిరేకిస్తున్న ఆదివాసులను అణచివేయడానికి వాళ్ల గ్రామాల మధ్య సైనిక క్యాంపులు ఏర్పాటు చేస్తూ, అక్రమ అరెస్టులు, నిర్బంధాలు విధిస్తున్నారన్నారు. వెంటనే ఈ దమనకాండను నిలిపివేయాలని, ఆదివాసీల ఉనికిని ప్రమాదంలో నెట్టవద్దన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మినారాయణ, కన్నెగంటి రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : మేయర్

బండ్లగూడ,జూన్ 3: ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మేయల్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేడియల్ రహదారులతో పాటు పలు గ్రామాల రోడ్లపై వెలిసిన గుంతలకు చేపట్టిన మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.అధికారులతో చర్చించి వారి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సెలవులకు టాటా.. నేటినుంచి బడిబాట

- నేడు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- మొదలుకానున్న విద్యార్థుల సందడి
- 19 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

జూబ్లీహిల్స్, జూన్ 11: వేసవి సెలవులు ముగించుకున్న విద్యార్థులు నేటినుంచి బడిబాట పట్టనున్నారు. సుమారు యాభై రోజుల విరామం అనంతరం విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరం నుంచి 2024-25 నూతన విద్యా సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ముందుగా జూన్ 1 నుంచి 11 వరకు ప్రకటించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నారు. కాగా.. ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు కాగా.. నేటినుంచి బడిబాట పట్టనుండగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, 2 జతల ఏకరూప దుస్తులను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఖైరతాబాద్-2 మండలంలో అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను తరలించిన అధికారులు నేటినుంచి పంపిణీ చేపట్టనున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్యను గడప గడపకు తెలియచేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. ఇందులో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు పెట్టే పెట్టుబడిని వారిపేరుమీద పొదుపుచేసి సర్కారు బడుల్లో ఉచితంగా చదివించాలని ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, పోషకాహారంతో కూడిన ఉచిత మధ్యాహ్న భోజనం, ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరాలు, ఆట మైదానాలు, మెరుగైన ఉత్తీర్ణతా శాతం, ఇతర సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేపడుతున్నారు. కాగా నేటినుంచి పాఠశాలలు ప్రారంభం కానుండడంతో ఆయా పాఠశాలల వద్ద విద్యార్థుల సందడి మొదలు కానుంది. ఖైరతాబాద్ జోన్ పరిధిలో సుమారు 67 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారు.

యూసుఫ్‌గూడ పాఠశాలలో ఉపాధ్యాయులకు యూనిఫాంలు అందజేస్తున్న డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్ కుమార్

నేడు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ..

జూబ్లీహిల్స్,జూన్11: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని.. తొలిరోజు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని అందజేయనున్నట్లు ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ సామ్యూల్ రాజ్ తెలిపారు. ఖైరతాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నేడు ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్కూల్ కమిటీలతో కలిసి యూనిఫాం, పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మంగళవారం యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్ డివిజన్‌లలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్ కుమార్ యూనిఫాంలు అందజేశారు. ఖైరతాబాద్-2 మండలంలో 65 వేల పాఠ్యపుస్తకాల్లో 48 వేల పుస్తకాలు ఇప్పటి వరకు అందినట్లు తెలిపారు.

నేడు పాఠశాలల్లో ప్రారంభోత్సవాలు..

నేడు పాఠశాలలు పునఃప్రారంభంకానున్న నేపథ్యంలో యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని పాఠశాలల్లో ప్రారంభోత్సవాలు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ పాఠశాలలో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, యూసుఫ్‌గూడ డివిజన్‌లోని పాఠశాలలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, ఎర్రగడ్డ ఓల్డ్ సుల్తాన్‌నగర్ పాఠశాలలో స్థానిక ప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు.

రోడ్డు ప్రమాదమృతుల్లో 42శాతం పాదచారులే

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజ్



బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్ సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఏసీపీ శంకర్ రాజ్, తదితరులు

బంజారాహిల్స్, జూన్ 11: రోడ్డు ప్రమాదాల్లో మరణించేవారిలో సుమారు 42శాతం పాదచారులు ఉండటం ఆందోళన కలిగించే అంశమని, రోడ్డుపై నడిచేటప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజ్ అన్నారు. బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో సిబ్బందికి మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గత ఏడాది హైదరాబాద్‌లో 2,370 రోడ్డు ప్రమాదాల్లో 280మంది మృత్యువాత పడగా వారిలో 121 మంది పాదచారులే ఉన్నారన్నారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు ఖచ్చితంగా జీబ్రా క్రాసింగ్‌వద్దనే దాడాలని, ఫుట్ పాత్‌ల మీద నడవాలని, రోడ్డు దాటేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్లి ప్రమాదాల పాలవుతుంటారని పేర్కొన్నారు. సిగ్నళ్ల వద్ద అడ్డదిడ్డంగా పరుగులు పెట్టే పాదచారులు తమ ప్రాణాలను ప్రమాదంలో పెట్టడంతో పాటు రోడ్డుమీద భారీ ప్రమాదాలకు కారణమవుతుంటారని వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్ ప్లేస్ సిబ్బందితో పాటు బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ ఓం సాయి ప్రకాశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ చెక్‌పోస్ట్‌లు..తనిఖీలు

జూబ్లీహిల్స్,జూన్11: బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రధాన రహదారుల్లోని కూడళ్లలో పోలీసు అధికారులు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. రహ్మత్ నగర్ డివిజన్, కార్మికనగర్ కూడలిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌లో ప్రతి వాహనాన్ని మధురానగర్ పోలీసులు తనిఖీచేస్తున్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

శంషాబాద్ ఎంఈవో రాంరెడ్డి

శంషాబాద్ రూరల్, జూన్ 11 : ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ ఎంఈవో రాంరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల ఎంఈవో కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. పాఠశాలల్లో యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు అమ్మినా..నిర్ధారించిన ఫీజు కన్న అధికంగా వసూలు చేసినా.. వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పాఠశాలల నోటీస్‌బోర్డులో వసూలు చేస్తున్న ఫీజు వివరాలు, బోధన సిబ్బంది విద్యార్హతలు, బోధిస్తున్న పాఠ్యపుస్తకాల వివరాలు ప్రదర్శించాలన్నారు. పాఠ్యపుస్తకాలు తల్లిదండ్రుల సమ్మతి ఉంటే నో ప్రాఫిట్ నో లాస్ ప్రాతిపదికన విద్యార్థులకు పబ్లిషర్ నుంచి సమకూర్చుకోవచ్చునని సూచించారు. ప్రధానంగా అనుభవం, లైసెన్స్ ఉన్న వారితోనే బస్సులను నడిపించాలన్నారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సెలవు రోజు పాఠశాలను నడిపిస్తే ఆ పాఠశాల అనుమతిని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాంరెడ్డి

నేటి నుంచి బడిబాట కార్యక్రమం

నేటి నుంచి శంషాబాద్ మండలంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాంరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12 న ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నట్లు తెలిపారు.

సెమీస్‌లోకి ప్రింట్ మీడియా టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వీ డ్రీమ్స్ బిజ్‌టెక్ కార్పొరేట్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం స్థానిక విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్‌మీడియా టీమ్ 39 పరుగుల తేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీజీ)పై విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రింట్ మీడియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. రవికుమార్(36), రోనిత్‌సింగ్(36) రాణించారు. ఫణి కిశోర్ (3/27) మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఏస్ఏటీజీ టీమ్ 7 వికెట్లు కోల్పోయి 147 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్ కుమార్‌బాబు (54) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన ప్రింట్‌మీడియా ప్లేయర్ రాజశేఖర్(3/18)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్-11 టీమ్‌తో ప్రింట్‌మీడియా తలపడుతుంది.

కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు..

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బుక్క వేణుగోపాల్ మంగళవారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలో బోగ్గు గనుల శాఖ కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డిని శాలువతో సన్మానించినట్లు తెలిపారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన నిధులు తీసుకురావాలని కోరారు. ఆయనతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

– శంషాబాద్ రూరల్, జూన్ 11

కేంద్ర మంత్రివర్గంలో మరోసారి స్థానం సంపాదించుకున్న రామ్‌దాస్ అథవాలేను సీనియర్ కాంగ్రెస్ నేత, ఏఆర్ మల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మల్లు శివరాం మంగళవారం ఢిల్లీలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మల్లు శివరామ్ మాట్లాడుతూ..బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటాల్లో కీలకపాత్ర పోషించిన రాందాస్ అథవాలేకు మరోమారు కేంద్రమంత్రిగా అవకాశం లభించడం సంతోషకరమన్నారు.

– బంజారాహిల్స్,జూన్ 11

ఘనంగా బొడ్రాయి వేడుకలు



పిల్లోనిగూడ గ్రామంలో జరిగిన బొడ్రాయి వేడుకల్లో భాగంగా పూజలు

శంషాబాద్ రూరల్, జూన్ 11 : శంషాబాద్ మండలంలోని పిల్లోనిగూడ గ్రామంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు,గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. బొడ్రాయి వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరు సుఖసంతోషంగా ఉండే విధంగా చూడాలని కోరినట్లు తెలిపారు. బొడ్రాయి ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహాములు దిరాజ్, జుర్కి రమేశ్, కిష్టయ్య, సత్తయ్య, అంతయ్య, గోపాల్, వెంకటయ్య, చంద్రయ్య, కృష్ణ, రమేశ్, పలువురు పాల్గొన్నారు.

అభినందన..

పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి మంచి మెజార్టీ వచ్చేలా కృషి చేసిన నాయకులను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అభినందించారు. ఈ మేరకు మంగళవారం రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో తనను కలిసిన నాయకులను సన్మానించడంతో పాటు ఓటు వేసిన కార్యకర్తలకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

– జూబ్లీహిల్స్,జూన్11

పేదలకు ఆర్థికంగా చేయూతనివ్వడం గొప్ప విషయం..

ముత్తూట్ ఫైనాన్స్‌లో పేద మహిళలకు, విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న శ్రీరామమూర్తి

హిమాయత్‌నగర్, జూన్ 11: సామాజిక బాధ్యతతో ముత్తూట్ ఫైనాన్స్ యాజమాన్యం ముందుకు వచ్చి పేద యువతుల వివాహాలకు, విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం గొప్ప విషయమని తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్, లిబర్టీలో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో ముత్తూట్ వివాహ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఫైనాన్స్ వ్యాపారంలో దిగ్గజ సంస్థగా కొనసాగుతున్న ముత్తూట్ ఫైనాన్స్ సామాజిక బాధ్యతను సైతం భుజాలపై వేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం 9మంది పేద మహిళలకు,13 మంది బీటెక్, ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జోనల్ మేనేజర్ జితేంద్ర కుమార్, సీఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ, రీజినల్ హెడ్స్ కె.వి.మురళి, సంపత్‌కుమార్, విబిన్ మీనన్, అబ్రహంజాన్, జిజో అబ్రహం, శ్రీనివాస్, ప్రతినిధులు గోపిశంకర్, అల్లూరి ప్రసన్నకుమార్, బిందు, మురళి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

బంజారాహిల్స్,జూన్ 11: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని శ్రీనికేతన్ కాలనీలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి మంగళవారం పర్యటించారు. కాలనీలో పాడయిపోయిన రోడ్లను తక్షణమే బాగువేయాలని, వర్షాలు రాకముందే వరదనీటి లైన్లను శుభ్రం చేయించాలని స్థానికులు కోరారు. కాలనీలో చెత్తాచెదారాన్ని తొలగించడంలో సిబ్బంది జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరించేలా చూస్తామని డీఎంసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డా.రవి. డీఈ మణిపాల్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

'నార్సింగి'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

- మున్సిపాలిటీ చైర్ పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్
- సాధారణ కౌన్సిల్ సమావేశం..
- రూ.56.57 కోట్ల నిధులకు ఆమోదం

నార్సింగి కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ, జూన్ 11: నార్సింగి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమవంతు బాధ్యతగా పని చేస్తున్నామని మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆమె అధ్యక్షతన మున్సిపాలిటీ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.56.57 కోట్లను ప్రవేశపెట్టి ఆమోదించారు. సీసీ రోడ్ల పనుల కోసం రూ.13.52 కోట్లు, డ్రైనేజీ పనుల కోసం రూ.8.45 కోట్లు, కమ్యూనిటీ హాల్ పనుల కోసం రూ.22.12 కోట్లు, వైకుంఠ ధామం పనులకు రూ.2.62 కోట్లు, వీధి దీపాల పనులకు రూ.2.55 కోట్లు, గ్రీనరీ పనులకు కోటి రూపాయలు, బోర్ మెటీరియల్, పరిశుధ్య కార్మికులు, పనిముట్లు, ఇతర పనుల కోసం 6.31 కోట్లు.. మొత్తం రూ.53.57 కోట్లకు ఆమోదించామని తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్ మాట్లాడుతూ .. అన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలకు సమస్యలు లేకుండా ఉండే విధంగా తీర్మానం చేశామన్నారు. కౌన్సిల్ సభ్యులందరి సహకారంతో మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అందుకు అధికారులు, సిబ్బంది, ప్రజలు సైతం తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ నిధులను కేటాయించి నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గోపాల విజయ్, కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, డీఈ ఎన్.నర్సింహారాజు, మేనేజర్ యోగేశ్, ఇరిగేషన్ డీఈ రామ, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన ప్రారంభం

చీరను ప్రదర్శిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత,ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజా రెడ్డి

వెంగళరావునగర్, జూన్ 11:శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయినిగమగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె చేనేత కారుల వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకతలను తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని పద్మజా రెడ్డి అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదన్నారు. చేనేత అమ్మ చల్లని ఒడిలా ఆమె వర్ణించారు. నిర్వాహకులు జయేశ్ గుప్తా మాట్లాడుతూ..ఈ నెల 16 వరకు ప్రదర్శన కొనసాగుతుందని, దేశంలోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి..

శంషాబాద్ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు

శంషాబాద్ రూరల్, జూన్ 11 : శంషాబాద్‌లోని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని శంషాబాద్ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు కోరారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశం చైర్‌పర్సన్ తీగల అనీతారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ తన్వీరాజు మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తొండుపల్లి నుంచి పాలమాకుల వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించగా.. ప్రస్తుతం గ్రామాల్లో తాగునీరు పూర్తి స్థాయిలో రావడంలేదని అన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ శశాంక, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైస్ చైర్మన్ ఈట గణేశ్‌ముదిరాజ్, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న శంషాబాద్ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, తదితరులు

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జైపాల్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 11: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ రాజేంద్రనగర్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియడంతో ఆరు గ్యారెంటీలలో కొన్ని అమలు చేశారని..అలాగే ప్రధానమైన హామీలను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గృహ జ్యోతి పథకం అమలు చేస్తామని చెప్పారని .. వెంటనే ఆ పథకం కింద రూ. 200 యూనిట్ల వరకు జీరో కింద బిల్లులు అమలు చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఈ పథకం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వృద్ధాప్య పింఛన్లు నాలుగు వేలు, మహిళలకు రూ.2500, గ్యాస్ సిలిండర్ ధర రూ.500లకే ఇంకా అనేక హామీలు ఇచ్చారని.. వాటిని వెంటనే అమలు చేసి ప్రజలకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. అమలు చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈ.నిరంజన్‌గౌడ్, జి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత వనంపల్లి జైపాల్‌రెడ్డి

రైతులకు రుణాలు అందించాలి

శంషాబాద్ రూరల్, జూన్ 11 : రైతులకు అవసరమైన రుణాలు అందించి ఆదుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీశ్ కోరారు. మంగళవారం నాంపల్లిలోని హెచ్‌డీసీసీబీ ప్రధాన బ్యాం